**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**విజయవాడ,**
**తేదీ : డిసెంబర్ 4, 2016.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
విజయవాడ.

> **ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ...**

**ఆర్యా!**

విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీలో కాఫీ తోటలు పనులు చేసిన గిరిజనులకు 2010 నుండి 90 కోట్లు వేతనాలు ప్రభుత్వం బకాయి ఉన్నది. అనారోగ్యం పాలయిన వారిని ఆసుపత్రులకు తీసుకెళ్ళాలంటే రవాణా సౌకర్యాలు లేక డొలిమోత, గుర్రాలతోనే తీసుకెళ్ళాల్సిన పరిస్థితి నేటికీ కొనసాగుతున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నా మందుల కొరత తీవ్రంగా వుంది. ఎపెడమిక్ సీజన్‌లో (మే నుండి అక్టోబర్ వరకు) డయేరియా, మలేరియా రోగాలతో 11 మండలాల్లో 188 మంది గిరిజనులు చనిపోయారు. వీరిలో ఎవరికీ ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టు పద్ధతిపై నియమించిన 95 మంది హెల్త్ అసిస్టెంట్లను గడువు పూర్తయిందని డిసెంబర్ 1న ఉద్యోగం నుండి తొలగించారు. దీంతో గిరిజనులకు అందే అంతంత మాత్రపు వైద్య సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ఏజెన్సీలో సగం గ్రామలకు పైగా విద్యుత్ సౌకర్యాలు లేవు. బోర్లు పనిచేయక మంచినీరు కొరత ఏర్పడింది. మంచినీటి కోసం ఇప్పటికీ ఊటనీటిమీదే ఆధారపడుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో 8 వేల కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ళకు బిల్లులు అందక అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఒత్తిడికి గురౌతున్నారు. వేల సంఖ్యలో పునాదివేసిన ఇళ్ళను రద్దుచేయడంతో గిరిజనులు ఆర్థికంగా దెబ్బదిన్నారు. మండలానికి 3వేల చొప్పున వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయినప్పటికీ పూర్తయిన మరుగుదొడ్లకు రూ.15,000లు చెల్లించాల్సి వుండగా కేవలం రూ.2,000 మాత్రమే చెల్లించారు. మరుగుదొడ్ల బకాయిలకోసం వేలాది గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో అక్షరాస్యత 36% వుంది. మహిళల్లో ఇది మరీ అధ్వాన్నంగా 18% వుంది. ప్రాథమిక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవటం ఈ దుస్థితికి కారణం. ఏజెన్సీలో 70 రోడ్లు ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన్ క్రింద మంజూరయ్యాయి. అటవీ అధికారుల పర్మిషన్ లేదని రోడ్లు వేయడంలేదు. అటవీ చట్టం క్రింద పబ్లిక్‌రోడ్లకు మినహాయింపు ఉన్నప్పటికీ పనులు జరగడంలేదు.

ఏజెన్సీలో వున్న 2016 –17 సంవత్సరంలో 10 వేలమంది కాఫీ రైతులకు ప్రోత్సాహక నిధులు సుమారు 40 కోట్లు అందడంలేదు. కాఫీ తోటల పెంపకంలో ఉపాధి హామీ పనులద్వారా కాఫీ రైతులకు

..... రెండవ పేజీ

తోటలపని చేసిన కూలీ 50 వేలమందికి 50 కోట్లు బకాయి ఉన్నది. పోడు భూములు సాగుజేసుకుంటున్న 52,268 మంది గిరిజనులు పట్టాలకోసం దరఖాస్తులు చేసుకుంటే 31 వేలమందికే పట్టాలు ఇచ్చారు. మిగిలిన 21,268 మందికి పట్టాలు ఇవ్వలేదు. వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేస్తే పుష్కలంగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెపిన మాటలు నమ్మి గిరిజనులు తమ స్వాధీనంలో వున్న భూముల్ని వివిఎస్‌గా మార్చారు. ఇప్పుడు వివిఎస్ అని ఈ భూములకు పట్టాలు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు సంరక్షణ సమితికి చట్టరీత్యా ఇవ్వాల్సిన ఉమ్మడి పట్టాలు కూడా ఇవ్వలేదు. బాక్సైట్ ఏరియా పేరుతో గిరిజనులకు ఆ ప్రాంతాల్లో పట్టాలు నిరాకరిస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో కరెంటు, నెట్‌వర్క్ సౌకర్యాలు లేక ఈ పాస్ విధానం ప్రజలకు ఉపయోగపడడంలేదు. పాడేరు ఏజెన్సీలో 406 డి.ఆర్.డిపోలుంటే 28రేషన్ డిపోల్లో ఈపాస్ విధానం అమలు చేయాలని నిర్ణయించగా కేవలం 8 రేషన్ డిపోల్లో మాత్రమే ఈపాస్ విధానం అమలు జరుగుతుంది. ఈ విధానం వలన ఏజెన్సీలో గిరిజనులకు వేలాది మందికి రేషన్ సక్రమంగా అందడంలేదు. ఈ విధానాన్ని రద్దు చేయాలి.

అభివృద్ధి ఫలాలకు నోచుకోని గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం అడవితల్లి బిడ్డలను ఆదుకోవాల్సిన అవసరం వున్నది. విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాను.

**డిమాండ్స్:**

**(1)** కాఫీ తోటల పని చేసిన గిరిజనులకు 2010 నుండి బకాయి ఉన్న 90 కోట్లు వెంటనే విడుదల చేయాలి.

**(2)** ఇందిరమ్మ ఇళ్లు, మరుగుదొడ్లు బకాయిలను వెంటనే చెల్లించాలి.

**(3)** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించి మందులు అందుబాటులో ఉంచాలి. తొలగించిన 90 మంది హెల్త్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.

**(4)** డయేరియా, మలేరియా జ్వరాలతో చనిపోయిన గిరిజనులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

**(5)** ప్రాథమిక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

**(6)** ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన క్రింద మంజూరైన 70 రోడ్ల నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలి.

**(7)** అటవీ హక్కుల చట్టప్రకారం సాగుభూములకు పట్టాలివ్వాలి.

**(8)** వన సంరక్షణ సమితులకు ఉమ్మడి పట్టాలివ్వాలి.

**(9)** రక్షిత మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు అన్ని గ్రామాలకు కల్పించాలి.

**(10)** అర్హులందరికీ రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి. ఈపాస్ విధానం రద్దు చేయాలి.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి